ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగం తెలుగువారి దృఢ సంకల్పానికి నిదర్శనమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.
- హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (హడ్కో), సీఆర్డీఏ(CRDA) మధ్య ఈరోజు ఒప్పందం జరిగింది.
- పదవ తరగతి విద్యార్థులకు ఉచిత ఆర్టీసి బస్సు సదుపాయం కల్పిస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

==================

ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మ త్యాగం తెలుగువారి దృఢ సంకల్పానికి నిదర్శనమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు అమరావతిలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా రాజధాని అమరావతిలో స్మారక పార్కును నిర్మించి, 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఆయన స్వంత గ్రామ అభివృద్ధికి చర్యలు చేపడతామని, అక్కడ మ్యూజియం ఏర్పాటు చేసి, ఆయన పేరుతో ఉన్నత పాఠశాలను నిర్మిస్తామని అన్నారు. ఏడాది పాటు పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వచ్చే ఏడాది మార్చి 16 వరకు వీటిని నిర్వహిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్..30 సెకన్లు)-సెట్

కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అన్ని జిల్లా కేంద్రాలలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు.

==================

హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (హడ్కో), సీఆర్డీఏ(CRDA) మధ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం రాజధాని అమరావతిలో నిర్మాణాలకు హడ్కో 11వేల కోట్ల రూపాయల రుణం అందించనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈరోజు అమరావతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ, హడ్కో సీఎండీ సంజయ్ కుల్ శ్రేష్ట్ పాల్గొన్నారు. ఈ సంవత్సరం జనవరి 22న ముంబయిలో నిర్వహించిన హడ్కో బోర్డు సమావేశంలో ఋణానికి సంబందించిన అంగీకారం లభించింది. ఒప్పందం పూర్తయిన నేపథ్యంలో త్వరలో ఆ నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది.

==================

రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుండి 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3450 పరీక్ష కేంద్రాలలో 6లక్షల 19వేల 275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో 3లక్షల 15 వేల 697 మంది బాలురు, 3లక్షల 3 వేల 578 మంది బాలికలు

ఉన్నారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ కింద నిషేదాజ్ఞలు అమలవుతాయని అధికారులు వెల్లడించారు.

===================

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం కఠోర దీక్ష చేసి తెలుగు జాతికి స్ఫూర్తిగా నిలిచిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర నేటి యువతకు ఆచరనీయమని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్ అన్నారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా కర్నూలు నగరంలోని పూల బజార్ వద్ద ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ..

(వాయిస్ బైట్..25 సెకన్లు)- కర్నూల్

58 రోజుల పాటు అమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. ప్రజల కోరిక మేరకు పొట్టి శ్రీరాములుకి భారతరత్న వచ్చేందుకు కృషి చేస్తానని ఈ విషయంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని మంత్రి టి.జి.భరత్ అన్నారు.

===================

విరామం

===================

పదవ తరగతి విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఉచితంగా ఆర్టీసి బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. తల్లితండ్రుల ఆశలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. పరీక్ష ప్రారంభం కావడానికి ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

===================

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కారం చూపాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులకు సూచించారు. నంద్యాల జిల్లాలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను ఆయన స్వయంగా స్వీకరించి, కొన్ని సమస్యలకు పరిష్కారం చూపారు. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతీ విజ్ఞప్తిని సంబంధిత శాఖా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. న్యాయ బద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి మంత్రి జనార్ధన్ రెడ్డి పరిష్కారం చూపారు.

===================

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి భయం లేకుండా విద్యార్థులంతా ప్రశాంత మనసుతో పరీక్షలు రాసి, మంచి ఫలితాలు సాధించాలని మంత్రి ఆకాంక్ష వ్యక్తం చేశారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకుని, ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. సంవత్సరం పాటు పడిన కష్టానికి ప్రతిఫలం వచ్చే సమయం ఇదేనని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో సమయాన్ని సద్వినియోగ పరచుకుని, సకాలంలో అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాసేలా సమయ నిర్వహణ చేసుకోవాలని అన్నారు. వేసవి నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో మంచినీరు సహా ఇతర అన్ని సౌకర్యాలు కల్పించినట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

===================

ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేందుకు, నిత్యం ఒక గంట సేపు వ్యాయామం చేయాలని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్లు విజయకృష్ణన్, దినేష్ కుమార్ లు సూచించారు. ఈరోజు అనకాపల్లిలో ఒక యోగ సంస్థ నిర్వహించిన సైకిల్ ర్యాలీలో వారు పాల్గొని, దాదాపు 5 కిలోమీటర్లు సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా 'సైకిల్ తొక్కండి-ఆరోగ్యంగా ఉండండి' అంటూ ప్రజలు నినదించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ.. రోగ నిరోధకత పెంచుకుని ఆరోగ్య సమస్యలు అధిగమించడానికి ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలని పేర్కొంటూ..

(వాయిస్ బైట్..23 సెకన్లు)-సెట్

అలాగే.. చిన్నారులను సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచుతూ ఆటపాటల్లో భాగం చేయాలని కలెక్టర్ సూచించారు.

===================

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని ఆకాశవాణి విశ్రాంత స్టేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ కొనియాడారు. తిరుపతిలో ఈరోజు అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు 124వ జయంతి కార్యక్రమానికి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో హరిజనులకు ఆలయ ప్రవేశం చేయించిన ఘనత పొట్టి శ్రీరాములకే దక్కిందన్నారు. గాంధీ స్మారక నిధి సంచాలకులుగా మద్రాస్ రాష్ట్రమంతా పర్యటించడం వలన ఆయనకు ప్రజా సమస్యలు తెలిసేవని చెప్పారు. ఇతరుల కోసం తమ జీవితాన్ని పణంగా పెట్టి పోరాడేవాడే నాయకుడిగా నిలుస్తాడన్నారు.

===================

రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విశాఖపట్నం జిల్లాలో ఏపీఎస్ఆర్టీసీ ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

===================

===================